
# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

## హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ప్రశ్నలు

- జన్వాడ ఫామ్‌హౌజ్ కూల్చివేతపై పిటిషన్

హైదరాబాద్,ఆగస్ట్21(నమస్తే ఉదయం): జన్వాడ ఫాంహౌస్ కూల్చొద్దంటూ ప్రదీప్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. వాదనల సందర్భంగా హైడ్రాకు ఉన్న పరిధుల గురించి చెప్పాలని ఏఏజీకి ఉన్నత న్యాయస్థానం సూచించింది. ఈక్రమంలో హైడ్రా స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థ అని ఏఏజీ పేర్కొన్నారు. మరోవైపు హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ప్రశ్నించింది. స్థల యజమానులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటారని తెలిపింది. స్థానిక సంస్థల అనుమతితో నిర్మాణాలు జరుగుతాయని పేర్కొంది. 15-20 ఏళ్ల తర్వాత మిగతా.. 2లో


రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 34 | పేజీలు: 4 | వెల: 4/- | గురువారం • 22, ఆగస్టు 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




జలమండలి ఈడిగా బాధ్యతలు స్వీకరించిన మయాంక్ మిట్టల్

### జలమండలి ఈడీగా మయాంక్ మిట్టల్

## బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, ఆగస్ట్ 21(నమస్తే ఉదయం): జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా మయాంక్ మిట్టల్ బాధ్యతలు స్వీకరించారు. నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన ను రాష్ట్రప్రభుత్వం వాటర్ బోర్డుకు ఈడీగా బదిలీ చేసింది. ఈ నేపథ్యంలోనే బుధవారం ఆయన ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఎండీ అశోక్ రెడ్డిని ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఎండీ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జలమండలి ఉన్నతాధికారులు, ఉద్యోగులు సైతం నూతన ఈడీకి పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికారు. మయాంక్ మిట్టల్ ఐఏఎస్-2020 బ్యాచ్‌కి చెందిన అధికారి.

# దక్షిణభాగం భూసేకరణ ప్రారంభించండి

- ఏమైనా ఇబ్బందులుంటే కేంద్రంతో మాట్లాడండి
- ఆర్ఆర్ఆర్ పురోగతిపై రోజువారీ సమీక్ష జరపండి
- సీఎస్ శాంతికుమారికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- అలైన్‌మెంట్‌లో మార్పులు సూచించిన సీఎం




హైదరాబాద్, ఆగస్టు 21,(నమస్తే ఉదయం): రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం మార్గానికి సంబంధించి భూసేకరణను వెంటనే ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని, పనుల్లో జాప్యం లేకుండా ముందుకు సాగాలని అన్నారు. పనుల పురోగతిపై రోజువారీ సమీక్ష జరపాలని, భూసేకరణ, ఇతర విషయాలపై ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని తనకు అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి సూచించారు.

ఈ అంశాలపై కలెక్టర్లు ప్రతి రోజూ సాయంత్రం సీఎస్‌కు నివేదిక అందించాలన్నారు. బుధవారం సచివాలయంలో ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం భూసేకరణపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. సీఎస్‌తోపాటు మౌలిక వసతులు, ప్రాజెక్టుల సలహాదారు శ్రీనివాసరాజు, సీఎం ఓఎస్‌డీ షానవాజ్ ఖాసీం, ఆయా జిల్లాల కలెక్టర్లు, రోడ్లు, భవనాల శాఖ ఉన్నతాధికారులతో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు అందులో పెట్టాలని సూచించారు.

ఈ సందర్భంగా ఆర్ఆర్ఆర్ మ్యాప్‌ను పరిశీలించిన సీఎం.. దక్షిణ భాగం అలైన్‌మెంట్‌లో కొన్ని మార్పులను ప్రతిపాదించారు. భవిష్యత్తు అవసరాలే ప్రాతిపదికగా అలైన్‌మెంట్ ఉండాలని, ఈ విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని అన్నారు. తాను ప్రతిపాదించిన మార్పులపై క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికను వీలైనంత త్వరగా అందజేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న ఫ్యూచర్ సిటీకి రేడియల్ రోడ్ల నిర్మాణంపైనా సీఎం పలు సూచనలు చేశారు. రేడియల్ రోడ్లు ఎక్కడికక్కడ ప్రధాన రహదారులకు, ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు కానున్న పరిశ్రమలకు అనుసంధానమయ్యేలా చూడాలని సూచించారు.

### అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో

## ఘోర అగ్నిప్రమాదం

- అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో ఘోర ప్రమాదం
- ఎసెన్షియా ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి 17 మంది మృతి
- ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి
- తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం





అనకాపల్లి, (నమస్తే ఉదయం): అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో ఘోర ప్రమాదం జరిగింది. రియాక్టర్ పేలిన ఘటనలో ఇప్పటివరకు 17 మంది మృతి చెందారు. మరో 60 మందికి పైగా గాయపడ్డారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద తీవ్రతను బట్టి మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు. పేలుడు ధాటికి మృత దేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. బాధితుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. రియాక్టర్ పేలుడు ధాటికి పరిశ్రమ భవనం దెబ్బతింది. శిథిలాల కింద పలువురు చిక్కుకుని ఉంటారని భావించి.. ఎసెన్షియా ఫార్మా కంపెనీలో 3 ఎన్డీఆర్ఎఫ్ బృందాల రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. శిథిలాల తొలగింపు కోసం భారీ క్రేన్లను అధికారులు తెప్పించారు. అంబులెన్సుల్లో మృతదేహాలు, బాధితులను తరలిస్తున్నారు. శిథిలాల తొలగింపు పూర్తయితే కానీ మృతులు, క్షతగాత్రుల సంఖ్య తేల్చలేని పరిస్థితిలో అధికారులు ఉందన్నారు. ఎసెన్షియా ఫార్మా కంపెనీలో వందల సంఖ్యలో కార్మికులు, సిబ్బంది పని చేస్తున్నారు. భోజన విరామ సమయంలో భారీ పేలుడు సంభవించి మంటలు చెలరేగాయి. దట్టంగా పొగ అలుముకుని ఏం జరుగుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. కార్మికులు ప్రాణ భయంతో బయటకు పరుగు తీశారు. భారీ శబ్దంతో మిగతా.. 2లో

## ఒక్క రాత్రిలోనే కలలన్నీ కల్లలయ్యాయి

- తమ కూతురు డాక్టర్ కావాలన్న ఆశలు అడియాశలు
- హత్యాచార డాక్టర్ తల్లిదండ్రుల ఆవేదన




కోల్‌కతా,ఆగస్ట్21(నమస్తే ఉదయం): కోల్‌కతాకు చెందిన వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనతో యావత్ దేశం మరోసారి ఉలిక్కిపడింది. అత్యంత పాశవికంగా అత్యాచారం చేసి చంపినట్లు వెలుగులోకి వస్తుండటం ప్రతి ఒక్కర్నీ కలచివేస్తోంది. ఈ క్రమంలో బాధితురాలి తల్లిదండ్రుల వేదన కన్నీటిని తెప్పిస్తోంది. ఓ వార్తాసంస్థతో బాధితురాలి తండ్రి మాట్లాడుతూ.. తమది నిరుపేద కుటుంబమని, అయినప్పటికీ డాక్టర్ అయ్యేందుకు తమ కూతురు ఎంతో శ్రమించిందన్నారు. చదువే లోకంగా బతికిందని.. కానీ, చివరకు ఒక్క రాత్రిలోనే కలలన్నీ చెదిరిపోయాయని వాపోవడం హృదయాలను కదిలిస్తోంది.డాక్టర్ అయ్యేందుకు ఆమె ఎంతో కష్టపడింది. చదువే లోకంగా బతికింది. చివరకు ఆమె అనుకున్నది సాధించడంతో ఎంతో సంతోషించాం. వైద్యవృత్తితో ఎంతోమందికి సహాయం చేయవచ్చని మిగతా.. 2లో

### రుణమాఫీ పేరుతో

## రైతులకు కుచ్చు టోపీ

- రూ.2 లక్షల రుణమాఫీ హామీ బూటకం
- ప్రభుత్వం అర్ధసత్యాలు, అసత్యాలను చెబుతోంది
- మంత్రుల మాటల్లోనే పొంతన లేకుండా పోయింది
- ప్రభుత్వ తీరుకు నిరసనగా నేడు మండల కేంద్రాల్లో ధర్నాలు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపు





హైదరాబాద్,ఆగస్ట్21(నమస్తే ఉదయం): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ హామీ బూటకమని.. రుణమాఫీ మొత్తం దగా, మోసమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మిగతా.. 2లో

### బిజెపి సభ్యత్వ నమోదు

## ప్రారంభం

- లాంఛనంగా ప్రారంభించిన కిషన్ రెడ్డి
- హామీలకు సిఎం రేవంత్ తూట్లు పొడిచారని విమర్శ



హైదరాబాద్,ఆగస్ట్21(నమస్తే ఉదయం): బీజేపీ సభ్యత్వ నమోదు ఉత్సవ్ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా ప్రారంభం అయ్యింది. ఇందులో భాగంగానే సికింద్రాబాద్ క్లాసిక్ గాడర్న్స్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీమతి విజయ రహత్కర్ హాజరవగా.. అభయ్ పాటిల్, చంద్రశేఖర్ తివారీ, ఎంపీలు లక్ష్మణ్, ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. మిగతా.. 2లో



## రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

- మంత్రి దామోదరను కలిసి విన్నవించిన మందకృష్ణ

హైదరాబాద్,ఆగస్ట్21(నమస్తే ఉదయం): ఎస్సీ వర్గీకరణపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణ రాష్ట్రంలో త్వరితగతిన అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ కోరారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహతో మందకృష్ణ మాదిగ, మాదిగ సామాజిక వర్గానికి చెందిన శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, డా. కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, కాలే యాదయ్య, మందుల శామ్యూల్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ అమలుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్రంలో త్వరితగతిన అమలయ్యేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించాలని శాసనసభ్యులు, దళిత మేధావులు, సామాజికవేత్తలు రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహకు విజ్ఞప్తి చేశారు. శాసనసభ్యులు, మాదిగ సామాజిక వర్గానికి చెందిన మేధావులు, సామాజికవేత్తలు చేసిన విజ్ఞప్తిపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సానుకూలంగా స్పందించారు. ఎస్సీ వర్గీకరణ అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చిస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్రంలో అమలుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన మేధావులు ప్రొఫెసర్ మల్లేశం, ప్రొఫెసర్ ఖాసీం, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మిగతా.. 2లో



## అక్రమ నిర్మాణాలు ఎవరివైనా కూల్చవేతలే

- కెటిఆర్ ఫామ్‌హౌజ్ కూల్చడం ఖాయం
- మంత్రి కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్,ఆగస్ట్21(నమస్తే ఉదయం): అక్రమ నిర్మాణాలు కెటిఆర్ లేదా ఇతర ప్రముఖులు కలిగి ఉన్నా కూల్చివేయడం ఖాయమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇందులో ఎవరికీ మినహాయింపు లేదన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ జన్వాడలో అక్రమంగా నిర్మించిన ఫామ్ హౌస్‌ను హైడ్రా అధికారులు కూల్చివేస్తారంటూ మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు చేశారు. మిగతా.. 2లో

## దేశంలో జనగణనకు రంగం సిద్ధం

- వచ్చే నెలలోనే ప్రారంభించే అవకాశం

న్యూఢిల్లీ,ఆగస్ట్21(నమస్తే ఉదయం): దేశంలో సుదీర్ఘ కాలంగా వాయిదా పడుతూ వస్తున్న జనాభా లెక్కల కార్యక్రమం ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి ప్రారంభం కానున్నట్లు సమాచారం. పదేళ్లకు ఒకసారి చేపట్టే ఈ కార్యక్రమాన్ని 2021లోనే నిర్వహించాల్సి ఉంది. అయితే.. అప్పుడు కొవిడ్ వ్యాప్తి దృష్ట్యా వాయిదా



పడింది. అప్పటి నుంచి పలు కారణాలతో జన గణన వాయిదా పడుతూ వస్తోంది. తాజాగా వచ్చే నెల నుంచి దీన్ని చేపట్టనున్నట్లు ప్రభుత్వ మిగతా.. 2లో



## రూ.2లక్షల వరకు రుణమాఫీ అమలు చేశాం...

- అందని వారు అధికారులను సంప్రదించాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

ఖమ్మం,ఆగస్ట్21(నమస్తే ఉదయం): రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అప్పుల్లో ఉన్నా రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు 22 లక్షల రైతు ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ చేశామని చెప్పారు. ఆధార్, బ్యాంకు ఖాతాల్లో తప్పులున్న వారికి మాత్రమే రుణమాఫీ ఆగిందన్నారు. వాటిని సరిదిద్ది రుణమాఫీ చేయాలని అధికారులను ఆశించామని చెప్పారు. రుణమాఫీ పొందలేని రైతులు.. వ్యవసాయాధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మిగతా.. 2లో

## బిజెపి సభ్యత్వ నమోదు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఒక్క గ్రామంలో కూడా పూర్తి రుణమాఫీ కాలేదని కిషన్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై సైతం కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కేసీఆర్ పద్ధతిలోనే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల హామీలకు సీఎం రేవంత్ రెడ్డి తూట్లు పొడుస్తున్నారన్నారు. రైతు రుణమాఫీని రేవంత్ రెడ్డి గందరగోళంగా మార్చారని కిషన్ రెడ్డి ఫైర్ అయ్యారు. దేవుళ్ళపై ఒట్లు వేసిన సీరేవంత్ రెడ్డి మాట తప్పారని విమర్శించారు. రాష్ట్రంలో 50 శాతం రుణమాఫీ కూడా పూర్తి కాలేదని కిషన్ రెడ్డి తెలిపారు. రుణమాఫీపై పూర్తి వివరాలను ప్రజలు ముందు ప్రభుత్వం ఉంచాలన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై ప్రజా ఉద్యమాలకు సిద్ధం అవుతున్నామన్నారు. బీజేపీ.. వ్యక్తులు, కుటుంబాల కోసం నడిచే పార్టీ కాదని.. పండుగ వాతావరణంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి రావటమే బీజేపీ లక్ష్యమన్నారు. బీజేపీ అధికారికంలోకి రావాలని ప్రజలే కోరుకుంటున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ ముక్తి దివస్ ను ఘనంగా నిర్వహిస్తామని కిషన్ రెడ్డి వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల స్ఫూర్తితో సభ్యత నమోదులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కుటుంబాల కోసం అవినీతికి పాల్పడుతున్న పార్టీలను తరిమికొడతామన్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీని మించిన ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ బీజేపీ అని కిషన్ రెడ్డి తెలిపారు. పార్టీ సభ్యత్వ నమోదును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు.

## ఒక్క రాత్రిలోనే కలలన్నీ కల్లలయ్యాయి

(మొదటి పేజీ తరువాయి)

తమతో చెప్పింది. కానీ, ఇప్పుడేం జరిగిందో చూడండి. కలలన్నీ ఒక్క రాత్రిలోనే చెదిరిపోయాయి. విధుల నిర్వహణ కోసం ఆమెను పంపిస్తే.. ఆస్పత్రి మాత్రం తమకు విగతజీవిగా అప్పగించింది. మా పని ముగిసిపోయింది. మా అమ్మాయి ఇక తిరిగి రాదు. ఆమె స్వరాన్ని, చిరునవ్వునూ నేనెప్పటికీ వినలేను. మేం ఇప్పుడు చేయగలిగేది ఆమెకు న్యాయం జరిగేలా చూడటమే అని ఓ అంతర్జాతీయ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వైద్య విద్యార్థిని తండ్రి వాపోయారు. మరోవైపు హత్యాచార ఘటనలో నిందితుడైన సంజయ్ రాయ్ వ్యక్తిగత జీవితంలోనూ క్రూరంగా ప్రవర్తించేవాడని తెలుస్తోంది. అతడికి, భార్యకు మధ్య సత్సంబంధాలు లేవని వెల్లడైంది. గర్భందాల్చిన తన కూతురిపై కొంత కాలం క్రితం అతడు చేయి చేసుకున్నాడని, దాంతో ఆమెకు గర్భస్రావమైనట్లు సంజయ్ రాయ్ అత్త వెల్లడించారు. సంజయ్ మంచివాడు కాదని, అతణ్ని ఉరితీసినా ఫర్వాలేదని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

## రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

కొండేటి మల్లయ్య, విజయ్ కుమార్ ముంజగళ్ళ, బాపిరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు మేడి పాపయ్య మాదిగ, గోవింద్ నరేష్‌లు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు ఎవరివైనా కూల్చివేతలే

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల తన కారులో సెల్ఫ్ డ్రైవ్ చేసుకుంటూ కేటీఆర్ ఫామ్ హౌస్ చూసివచ్చినట్లు మంత్రి తెలిపారు. ఆ సమయంలో కేటీఆర్ భార్య అక్కడ పని చేయిస్తున్నారని చెప్పారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఉంటే హైడ్రా అధికారులు ఫామ్ హౌస్ తప్పకుండా కూలుస్తారని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఫామ్ హౌస్ ఉందని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మండిపడ్డారు. సీఎంకు అసలు ఫామ్ హౌస్ ఎక్కడుందని ప్రశ్నించారు. హైదరాబాద్ నగర పరిధిలో ఎక్కడ అక్రమ నిర్మాణాలు ఉన్నా హైడ్రా అధికారులు కూల్చివేస్తారని మంత్రి హెచ్చరించారు. సినిమా యాక్టర్ల బిల్డింగులు అక్రమంగా నిర్మించినట్లు తేలితే వాటిని కూడా వదిలే ప్రసక్తే లేదని మంత్రి పేర్కొన్నారు. ఈ విషయంలో ఎవరికీ మినహాయింపు ఉండదన్నారు.

బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనం కావడం ఖాయమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఇకపై కేటీఆర్, హరీశ్‌ను బీజేపీ లీడర్లనే పిలవాలంటూ ఎద్దేవా చేశారు. ఢిల్లీలో ఏం జరుగుతుందో తనకు తెలుసంటూ మంత్రి చెప్పుకొచ్చారు. కేటీఆర్ ఆరోగ్యంపై శ్రద్ధపెట్టాలని కల్వకుంట్ల ఫ్యామిలీకి ఆయన హితవుపలికారు. కేటీఆర్ యువకుడని ఆయనకు ఏమైనా అయితే ఇబ్బంది అవుతుందని అన్నారు. ఆయణ్ని చూస్తేనే జాలి వేస్తోందంటూ మంత్రి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పదేళ్లల్లో ఒక్కసారి కూడా అంబేద్కర్‌కి దండ వేయని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్ మళ్లీ తామే అధికారంలోకి వస్తామని చెప్తుంటే నవ్వొస్తోందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలందరూ కలిస్తేనే తెలంగాణ వచ్చిందని, కేసీఆర్ లాగా తాము దొంగ దీక్షలు చేయలేదని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. దేశం కోసం మాంసపు ముద్దయిన రాజీవ్ గాంధీ విగ్రహం సచివాలయం ఎదుట పెడితే తప్పేంటని ప్రశ్నించారు. విగ్రహం ఏర్పాటును బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని మండిపడ్డారు. వాజ్ పేయి విగ్రహం పెడితే మంచిదేనని, మంచి స్థలం దొరికితే ఆయన విగ్రహాన్నీ పెడతామన్నారు. ఇక కేటీఆర్ తన జీవితంలో సర్పంచ్ కూడా కాలేరని విమర్శించారు. గురువారం రోజున బీఆర్ఎస్ నిర్వహించే ధర్నాకు కనీసం వెయ్యి మంది రారంటూ మంత్రి ఎద్దేవా చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ దుకాణం బంద్ అయ్యిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పుకొచ్చారు.

## దేశంలో జనగణనకు రంగం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

వర్గాలు వెల్లడించాయి. సెప్టెంబర్‌లో ప్రారంభమైతే.. కొత్త సర్వే పూర్తి కావడానికి దాదాపు 18 నెలలు పట్టే అవకాశమున్నట్లు పేర్కొన్నాయి. ప్రధాని కార్యాలయం నుంచి తుది ఆమోదం రావాల్సి ఉందని వెల్లడించాయి. జన గణనను చేపట్టే కేంద్ర హోంశాఖ, కేంద్ర గణాంకాల శాఖలు కాల పరిమితిని నిర్ణయించాయని.. 2026 మార్చి నాటికి 15 సంవత్సరాల డేటాను విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆ అధికారులు తెలిపారు. అయితే.. దీనిపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, గణాంకాల శాఖ నుంచి ఎటువంటి ధ్రువీకరణ రాలేదు. జనగణన, జాతీయ జనాభా నమోదు ప్రక్రియ కోసం ఈసారి బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ రూ.1,309.46 కోట్లను కేటాయించారు. మూడేళ్ల క్రితం నాటి కేటాయింపులతో పోలిస్తే ఈ మొత్తం తక్కువే. 2021-2022లో జన గణనకు రూ.3,768 కోట్లను ప్రతిపాదించినప్పటికీ ఆ దిశగా అడుగులు పడలేదు. ఇక జన గణన ఆలస్యంపై పలువురు నిపుణులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇతర గణాంక సర్వేల నాణ్యతపై ఇది ప్రభావం చూపిస్తుందని అంటున్నారు. ప్రస్తుతం చాలా వాటికి 2011 జనాభా లెక్కలనే ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. ఇక గత ఏడాది ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన నివేదిక ప్రకారం.. జనాభా విషయంలో చైనాను భారత్ అధిగమించి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా అవతరించింది. 1950లో ఐరాస జనాభా సమాచారాన్ని వెల్లడించడం మొదలుపెట్టిన తర్వాత ప్రపంచ జనాభా జాబితాలో భారత్ తొలిసారిగా ప్రథమ స్థానంలో నిలిచింది.

## రూ.2లక్షల వరకు రుణమాఫీ అమలు చేశాం...

(మొదటి పేజీ తరువాయి)

రైతు వేదికలు, మండల ఆఫీసుల్లో అధికారులను పెట్టి వివరాలు తీసుకుంటామని తెలిపారు. బుధవారం ఖమ్మంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుల గురించి ఏమాత్రం పట్టించుకోని, పదేళ్ల పాటు రైతుల్ని మోసం చేసిన పార్టీ ముసలి కన్నీరు కారుస్తోంది. నల్ల చట్టాలు తెచ్చి రైతులను ఇబ్బంది పెట్టిన పార్టీ కూడా మాట్లాడుతోంది. అసత్యాలు చెప్పి రైతుల్లో ఆందోళన పెంచాలని చూస్తున్నారు. రుణమాఫీపై ఎలాంటి ఆంక్షలు విధించలేదు. బ్యాంకులు, అధికారులు ఏమైనా తప్పు చేస్తే.. వాటిని సరిదిద్దే ప్రక్రియ కొనసాగుతోంది. 41,78,892 మంది రైతులు రుణాలు తీసుకున్నారని బ్యాంకులు చెప్పాయి. వారి బకాయిలు రూ.31వేల కోట్లు ఉన్నాయి. చిన్న, సన్నకారు రైతులకు ఎక్కువగా రూ.2లక్షలలోపు రుణాలే ఉన్నాయి. రుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చెందకుండా వ్యవసాయ పనులు చూసుకోవాలి' అని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

# గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### స్టేట్ సివి హెచ్చో డాక్టర్ అబ్దుల్ వాసే.

### ఎన్ సి డి ఫాలోఅప్ కేసులు ప్రతినెల క్రమం తప్పకుండా చేయాలి

**గద్వాల్, ఆగస్టు21(నమస్తే ఉదయం):** గ్రామీణ ప్రజలకు వైద్య సిబ్బంది మెరుగైన సేవలు అందించాలనిరాష్ట్ర వైద్య అధికారి సి వి హెచ్ ఓ అబ్దుల్ వాసే సూచించారు.

బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సిద్దప్ప ఆదేశాల బుధవారం జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రోగ్రాం అధికారి జి రాజు ఆధ్వర్యంలో రాష్ట్ర వైద్య అధికారి సి వి హెచ్ ఓ అబ్దుల్ వాసే విచ్చేసి.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లకు, హెల్త్ సూపర్వైజర్లకు, ఎన్ సి డి స్క్రీనింగ్ పై సమీక్షా సమావేశం నిర్వహించారు.



వైద్య సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న సి వి హెచ్ ఓ అబ్దుల్ వాసే

ఈ సందర్భంగా డిఎంహెచ్వో డాక్టర్ సిద్ధప్ప మాట్లాడుతూ... నెల నెల గ్రామాలలో ఉన్న బీపి, షుగర్ పేషెం ట్లకు, మందులు పంపిణీ చేసి,ఆన్లైన్‌లో నమోదు చేయాలన్నారు. హెల్త్ సూపర్వైజర్లు ఈ కార్యక్రమం పై పర్యవేక్షణ చేయాలని, ఏఎన్ఎం స్క్రీనింగ్ గ్రామాలలో క్వాలిటీగా క్యాంపులను ఏర్పాటు చేసి, 30 సంవత్సరముల పైబడిన వారందరికీ స్క్రీనింగ్ జరపాలని, మెడికల్ ఆఫీసర్ లాగిన్‌కి పంపించి స్కానింగ్ జరపాలని ఈ సందర్భంగా తెలిపారు.

ఇట్టి కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యాంసుందర్ , డిడియం రామాంజనేయులు, కళ్యాణి, వివిధ ప్రాథమిక మెడికల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ప్రశ్నలు

(మొదటి పేజీ తరువాయి)

హైడ్రా వచ్చి అక్రమ నిర్మాణమంటూ కూల్చివేయడ మేంటని న్యాయస్థానం ప్రశ్నించింది. మరోవైపు చెరువుల పరిరక్షణ కోసమే హైడ్రా ఏర్పాటైందని ఏఏజీ తెలిపారు. ప్రదీప్‌రెడ్డి వేసిన పిటిషన్‌కు విచారణార్హత లేదని చెప్పారు. జన్వాడలో ఉన్న ఫాంహౌస్ జీవో 111లోకి వస్తుందని పేర్కొన్నారు. జీవో 111 పరిధిలోని భూములు, ఫాంహౌజ్‌లు నీటిపారుదల శాఖ చూస్తోందని వివరించారు. వీటిని కూల్చివేసే హక్కు హైడ్రాకు లేదని ఏఏజీ తెలిపారు. కూల్చివేతల గురించి చర్చించాల్సి ఉందని హైకోర్టు తెలిపింది. విచారణను మధ్యాహ్ననికి వాయిదా వేసింది. జన్వాడ ఫాంహౌస్ కూల్చొద్దంటూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. యజమాని ప్రదీప్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. ప్రతివాదులుగా రాష్ట్ర ప్రభుత్వం, హైడ్రా కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, లేక్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు, శంకర్‌పల్లి తహసీల్దార్, చీఫ్ ఇంజినీర్‌ను చేర్చారు. ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో తన ఫాంహౌస్, పొలం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నెల 14న నా ఫాంహౌస్‌ను నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఫాంహౌస్ లేదని ఆధారాలు చూపించాను. ఎఫ్‌టీఎల్ పరిధిలోనే నిర్మాణం ఉందని అధికారులు వాదించారు. 2019లో ఫాంహౌస్‌ను కొనుగోలు చేశాను. రాజకీయ కారణాలతో నా ఆస్తికి నష్టం చేయాలని చూస్తున్నారు అని ప్రదీప్‌రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై హైకోర్టు విచారణ చేపట్టింది.

## శ్రీరాంసాగర్‌కు భారీగా వరదనీరు

**నిజామాబాద్,ఆగస్ట్21(నమస్తే ఉదయం):** ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో రాష్ట్రంలోని ప్రాజెక్ట్ జలకళను సంతరించుకుంటున్నాయి. తాజాగా శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరద కొనసాగుతున్నది. ప్రాజెక్ట్‌లోకి 10,591 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. కాకతీయ కాలువ ద్వారా 2,465 క్యూసెక్కుల నీటిని కిందకు విడుద చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం1082 అడుగులు ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సమార్థ్యం 80.5 టీఎంసీలు. ప్రస్తుత నీటినిల్వ సామర్థ్యం 50.70 టీఎంసీలు.

## అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో ఘోర అగ్నిప్రమాదం

(మొదటిపేజీ తరువాయి..)

సమీప గ్రామాల ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మొత్తం 12 అగ్నిమాపక వాహనాలు వచ్చి మంటలను అదుపుచేశాయి.

### బాధితుల పరామర్శకు నేడు అచ్యుతాపురానికి సీఎం చంద్రబాబు నాయుడు

సీఎం చంద్రబాబు నాయుడు రేపు అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం వెళ్లనున్నారు. ఫార్మా సెజ్ లోని ఎసెన్షియా అనే కంపెనీలో రియాక్టర్ పేలి మృతి చెందిన వారి కుటుంబాలను,



ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వారిని పరామర్శించనున్నారు. ప్రమాదం జరిగిన ఘటనా ప్రాంతాన్ని ముఖ్యమంత్రి పరిశీలించనున్నారు. ఘటనపై ముఖ్యమంత్రి బుధవారం నిరంతరం సమీక్ష చేశారు. సహాయక చర్యలపై జిల్లా అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడారు. హెల్త్ సెక్రటరీతో మాట్లాడి ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన



వైద్యం అందించాలని సీఎం సూచించారు. అవసరమైతే క్షతగాత్రులను విశాఖ లేదా హైదరాబాద్ తరలించేందుకు ఎయిర్ అంబులెన్సులను వినియోగించాలని ఆదేశించారు. కార్మికుల ప్రాణాలు కాపాడడానికి ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రమాదంపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. విచారణ ఆధారంగా.. ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం ప్రకటించారు.

### ఘటనపై హెూం మంత్రి అనిత ఆరా

ఫార్మా కంపెనీ ప్రమాదంపై హెూం మంత్రి అనిత ఆరా తీశారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

### బాధితులకు అండగా నిలవాలి: మాజీ సీఎం జగన్

ఫార్మాకంపెనీలో రియాక్టర్ పేలుడు ప్రమాదంపై స్థానిక నాయకులతో మాట్లాడి ఈ ఘటనపై మాజీ సీఎం జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసు కోవాలన్నారు. ఈ ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు తన సంతాపాన్ని, సానుభూతిని తెలియజేస్తున్నానన్నారు. వైయస్సార్‌సీపీ ప్రభుత్వం ఎల్జీ పాలిమర్స్ బాధితులను ఆదుకున్న తరహాలోనే ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.1కోటి చొప్పున పరిహారం అందించాలని శ్రీ వైయస్.జగన్ డిమాండ్ చేశారు. గాయపడి చికిత్స పొందుతున్న వారికి ఉచితంగా ఉత్తమ వైద్యం అందించాలని, వారు కోలుకునేంతవరకూ ఆర్థిక సహాయం చేయాలని ప్రభుత్వాన్ని గట్టిగా కోరారు.ఫార్మాకంపెనీలో రియాక్టర్ ప్రమాదంపై ఉన్నత స్థాయి విచారణ జరిపి మళ్లీ అలాంటి ఘటనలు జరక్కుండా గట్టిచర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు.

# రుణమాఫీ పేరుతో రైతులకు కుచ్చు టోపీ

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం చెబుతున్నవి అర్ధసత్యాలు, అసత్యాలన్నారు. రుణమాఫీపేరుతో రైతులకు కుచ్చు టోపీ అని మండిపడ్డారు.
రుణమాఫీ విషయంలో ప్రభుత్వ తీరును ఎండగడుతూ.. గురువారం అన్ని మండల కేంద్రాల్లో రైతుల ధర్నాలు ఉంటాయి. రేపటి ఆందోళనలు మొదటి అడుగు మాత్రమే. రైతులపై కేసులు ఉపసంహరించు కోవాలన్నారు. రుణమాఫీ చేయనందుకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం వ్యాఖ్యలకు నిరసనగా తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకాలు చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. ఎప్పటిలోగా రుణమాఫీ పూర్తి చేస్తారో చెప్పాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రూ.2 లక్షలు రుణమాఫీ చేశామని మంత్రి తుమ్మల చెప్పారు. రుణమాఫీపై ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారని.. రుణమాఫీపై రైతులకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆగ్రహంతో రగిలిపోతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.
రుణమాఫీ జరగక రైతులు రోడ్డెక్కు తున్నరు.. ఏ పత్రిక, ఛానల్ చూసినా ఇవే వార్తలు కనిపిస్తున్నాయి. ఆందోళన చేస్తున్న రైతులపై ఏడేళ్లు, రెండేళ్ల శిక్షలు పడే కేసులు పెడుతూ మరోవైపు అందరికి రుణమాఫీ అయిందని సీఎం సంబరాలు చేసుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. రూ.31 వేల కోట్లు మాఫీ చేశామని సీఎం చెబుతున్నారు. రుణమాఫీపై మంత్రులు తలోమాట మాట్లాడుతున్నారు. సాంకేతిక కారణాలతో మాఫీ కాలేదని మంత్రులు చెబుతున్నారు. భట్టి చెప్పిన లెక్కలు వింటే రుణమాఫీ వట్టిదేనని తేలిపోయింది. మాఫీ ఎట్లా ఎగ్గొడదామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తుగడలు వేస్తుందని.. అసలు రుణమాఫీపై ప్రభుత్వానికి స్పష్టత ఉందా..లేదా.. అని కేటీఆర్ ప్రశ్నించారు. మాఫీ 30 శాతం, కాంగ్రెస్ మోసం 100 శాతమన్న ఆయన ఇది రైతు స్వరాజ్యం కాదు.. ఏడిపిస్తున్న రాజ్యమని ధ్వజమెత్తారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా బీఆర్ఎస్ ఉన్నంతకాలం రైతులకు అండగా ఉంటుందని, రైతులు స్థైర్యం కోల్పోవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. చ్చి మోసగాళ్ల ప్రభుత్వం ఇదని.. 49 వేల కోట్ల వ్యవసాయ రుణాలున్నాయని చెప్పింది మీరా..కాదా..? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేటీఆర్.. ప్రభుత్వం రుణమాఫీ పేరుతో కేవలం రూ.7500 కోట్లతో సరిపెట్టాలని చూస్తున్నట్టుందన్నారు. లక్షల మంది రైతులను మోసం చేసిన ఈ ప్రభుత్వాన్ని ఏం చేయాలి..? సీఎం తడిగుడ్డతో రైతుల గొంతు కోసిండు.

ప్రజల దృష్టి మళ్లించేందుకు సీఎం రేవంత్ బజారు భాష మాట్లాడుతున్నారు. కేసీఆర్‌ను తిడితే సంబరపడే కొన్ని మీడియా సంస్థలున్నాయి. మొత్తం రుణమాఫీ చేసే వరకు ప్రభుత్వాన్ని వెంటాడుతామని కేటీఆర్ హెచ్చరించారు.

# కోల్‌కతా కేసులో డాక్టర్ల ఆందోళన - ఆస్పత్రిలో విధ్వంసంపై నిర్లక్ష్యం

## ఇద్దరు పోలీసులను సస్పెండ్ చేసిన ప్రభుత్వం

**కోల్‌కతా,ఆగస్ట్21(నమస్తే ఉదయం):** కోల్‌కతా కేసులో డాక్టర్ల ఆందోళ కొనసాగుతోంది. ఆర్జీకర్ ఆస్పత్రిపై అర్ధరాత్రి విధ్వంసం సృష్టించిన ఘటనలో ఇద్దరు ఏసీపీలు, ఎస్ఐలు సస్పెండ్ అయ్యారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారన్న ఆరోపణలతో వేటు పడింది. ఆస్పత్రిపై విధ్వంసం సృష్టించిన 40 మంది దుండగులు అరెస్టు అయ్యారు. కోల్‌కతా మెడికో హత్యాచార ఘటనకు సంబంధించి డాక్టర్ల ఆందోళన కొనసాగుతోంది. అలాగే ఈ ఘటనకు బాధ్యులైన కొంతమందిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటన దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున సంచాలనం సృష్టించింది. ఈ కేసులో ఇప్పటికే కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే తాజాగా ఆర్జీకర్ ఆస్పత్రిపై అర్ధరాత్రి విధ్వంసం సృష్టించిన ఆందోళన కారులు 40 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అల్లర్లలో పాల్గొన్న మరికొంది కోసం సీసీటీవీ ఫూటేజీని పరిశీలిస్తున్నారు. ఈ విధ్వంస ఘటనను పోలీసులు నిలువరించలేకపోవడంతో ఇద్దరు ఏసీపీలు, ఎస్ఐలు సస్పెండ్ అయ్యారు. ఈ కేసుకు సంబంధించి మంగళవారం సుప్రీం కోర్టులో వాదనలు జరిగాయి. ఆస్పత్రుల్లో వైద్యుల భద్రత కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు సుప్రీంకోర్టు తొమ్మిది మంది సభ్యులతో కూడిన జాతీయ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాల, ఆస్పత్రిలో తీవ్ర సంచలనం సృష్టించిన జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం కేసును సుమోటోగా స్వీకరిస్తూ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. టాస్క్‌ఫోర్స్‌లో హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డికి చోటు కల్పించింది. పని ప్రదేశాల్లో వైద్యులపై లైంగిక పరమైన హింసను నివారించేందుకు.. వైద్యులు, నర్సులకు భద్రత, గౌరవప్రదమైన పరిస్థితులు కల్పించడానికి జాతీయ కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఎన్‌టీఎఫ్‌కు నిర్దేశించింది. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్, తన మధ్యంతర నివేదికను మూడు వారాల్లోగా.. పూర్తిస్థాయి నివేదికను రెండు నెలల్లోగా సమర్పించాలని ఆదేశించింది. టాస్క్‌ఫోర్స్‌కు కేంద్ర క్యాబినెట్, హోంశాఖ, ఆరోగ్యశాఖ కార్యదర్శులు.. జాతీయ




వైద్యమండలి (ఎన్‌ఎంసీ) చైర్‌పర్సన్, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రెసిడెంట్ ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారని ధర్మాసనం పేర్కొంది. వైద్యులపై భౌతికదాడులు, లైంగిక హింసకు సంబంధించి వైద్యసంస్థలు తమకు తాము ఎలాంటి నిబంధనలను రూపొందించుకోకపోవడం తీవ్ర ఆందోళనకరం అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. వైద్యుల భద్రత కోసం చట్టాలు ఉన్నాయని.. అయితే అవి వ్యవస్థాగత సమస్య (సిస్టమెటిక్ ఇష్యూస్)లను పరిష్కరించలేవు అని వ్యాఖ్యానించింది. పనిచేసే చోట వైద్యులకు భద్రతాలేమిపై సుప్రీం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ.. క్షేత్రస్థాయిలో మార్పులు తెచ్చేందదుకు మరో అత్యాచారమో.. హత్యో జరిగేదాకా ఎదురుచూడకూడదు అని కోర్టు వ్యాఖ్యానించింది. ఆర్జీకర్ ఆస్పత్రిలో హత్యాచారం, హత్యకు గురైన జూనియర్ వైద్యురాలి పేర్లు, ఫొటోలు, వీడియోలను తక్షణమే సామాజిక మాధ్యమాల్లోంచి తొలగించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హత్యాచార ఘటనకు నిరసనగా దేశవ్యాప్తంగా ర్యాలీలు నిర్వహిస్తున్న వైద్యులు.. ఆందోళనలను విరమించి, ఎప్పటిలాగే వైద్యసేవలు కొనసాగించాలని అప్పీలు చేసింది. వైద్యుల సమ్మెతో వైద్య సేవలు అందక రోగులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొంది. 'వైద్యుల భద్రతపై భరోసా కల్పించేందుకు మేం ఉన్నాం.. ప్లీజ్ మమ్మల్ని నమ్మండి' అని వైద్యులను ఉద్దేశించి పేర్కొంది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఢిల్లీలోని ఆర్ఎంల్ ఆస్పత్రి వైద్యులు తమ సమ్మెకు ముగింపు పలికారు. జూనియర్ వైద్యురాలిపై హత్యాచార కేసును సుమోటోగా స్వీకరించడాన్ని రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ స్వాగతించింది. మరోవైపు.. ఆర్జీ కర్ ఆస్పత్రిలో ఆర్థిక అవకతవకలపై విచారణ జరిపేందుకు స్వామి వివేకానంద స్టేట్ పోలీస్ అకాడమీ ఐజీ డాక్టర్ ప్రణవ్ కుమార్ సారత్యంలో నాలుగు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) బెంగాల్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.



## వాహనం ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతి

**రాజేంద్రనగర్,ఆగస్టు 21 (నమస్తే ఉదయం):** గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్సై హుస్సేన్ ఏఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం...పీవీ నరసింహారావు ఎలివేటెడ్ ఎక్స్ప్రెస్ వే 236 పిల్లర్ సమీపంలో గుర్తుతెలియని మృతదేహం పడి ఉందన్న సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేయాన్ని స్వాధీనం చేసుకున్నారు.పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయసు 35 సంవత్సరాలు ఉంటుందని మృతుడి శరీరంపై పింక్ కలర్ చెక్స్ షర్టు,కాకి కలర్ ప్యాంటు ధరించినట్లు తెలిపారు.మృతుడి కుడి చేతి పై అమ్మానాన్న అనే పచ్చబొట్లు,టిఎస్ కె ఉన్నాయని మృతుడి ఆచూకీ తెలిసినవారు అత్తాపూర్ పోలీసులను సంప్రదించాలని కోరారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రభుత్వ ఆశయాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలి

### అసిస్టెంట్ ఇంజనీర్ నరేందర్

### పదోన్నతి పొందిన విద్యుత్ సిబ్బంది విధుల్లో చేరిక

**షాబాద్, ఆగస్టు21(నమస్తే ఉదయం):** ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్తూ మెరుగైన విద్యుత్ సేవలు అందించాలని షాబాద్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ నరేందర్ సూచించారు. బుధవారం లైన్ మాన్ గా విధులు నిర్వహిస్తున్న మాణిక్యం లైన్ ఇన్స్పెక్టర్ గా పదోన్నతి పొంది చిలుకూరు సెక్షన్ కు బదిలీ అయ్యారు. షాబాద్ సెక్షన్లో జూనియర్ లైన్ మ్యాన్లుగా పనిచేస్తున్న లక్ష్మణ్, రాకేష్, బి శివకుమార్, నరసింహ, ప్రవీణ్, సాజిద్, రమేష్ లు అసిస్టెంట్ లైన్ మ్యాన్లుగా పదోన్నతి పొంది విధుల్లో చేరారు.



విధుల్లో చేరిన పదోన్నతి పొందిన లైన్ ఇన్స్పెక్టర్, అసిస్టెంట్ లైన్‌మ్యాన్లు

ఈ సందర్భంగా అసిస్టెంట్ ఇంజనీర్ నరేందర్ మాట్లాడుతూ... అత్యవసర సేవలు అందిస్తున్న విద్యుత్ శాఖలో పనిచేస్తున్న సిబ్బందికి మంచి వేతనాలు ఇస్తుందని, అందుకోసం సిబ్బంది విద్యుత్ వినియోగదారులకు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారులతో సిబ్బంది సఖ్యతతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## నేడు మన్నె మహాత్మారావుకు సన్మానం




మన్నె మహాత్మారావు

**రాజేంద్రనగర్, ఆగస్టు21(నమస్తే ఉదయం):** కవి, గాయకులు రచయిత మన్నె మహాత్మారావుకు ఈనెల 22న సాయంత్రం 6:30 గంటలకు రాజేంద్రనగర్ శ్రీ మాతా పోచమ్మ దేవాలయం ఆవరణలో లో సన్మానం చేయనున్నారు. శ్రీ మాతా పోచమ్మ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ సన్మానాన్ని చేపట్టారు. కవిగా నాయకునిగా నటన నైపుణ్యం కలిగిన వ్యక్తిగా చిన్ననాటి నుంచే మన్నె మహాత్మారావు కు పేరుంది. ఆయన శ్రీ రాఘవేంద్ర స్వామి నాటకం తో పాటు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్రలకు సంబంధించిన నాటక ప్రదర్శనలో ఎంతో చక్కగా నటించారు. మన్నె మహాత్మాగావు అనేక ఆధ్యాత్మిక గీతాలు రచించి స్వయంగా పాడారు. వినాయక నవరాత్రులలో పాడే పాటలతో పాటు భజన పాటలు ఆయన ఎంతో చక్కగా పాడుతారని పేరుంది.

## వ్యక్తిగత కారణాలతోనే గద్వాల్ సిఐ లీవ్‌పై వెళ్ళారు

### - గద్వాల డిఎస్పి సత్యనారాయణ

### ఇందులో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవు



**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు21 (నమస్తే ఉదయం):** గద్వాల్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బీమ్ కుమార్ వ్యక్తిగత కారణాలతోనే సెలవుపై వెళ్లారని, లీవ్‌లో వెళ్ళడానికి ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవని గద్వాల డీఎస్పీ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. గద్వాల్ సీఐ సోదరుడికి పెరాలసిస్ స్ట్రోక్ రావడం వల్ల కర్నూల్‌లోని ఒక హాస్పటల్ నందు చికిత్స పొందుతున్నారని అందుకు సి ఐ మూడు రోజుల పాటు లీవ్ పై వెళ్ళడం జరిగిందనీ, ఇందులో ఎలాంటి రాజకీయ వత్తిళ్లు గానీ ,రాజకీయ కారణాలు గాని లేవని గద్వాల డీఎస్పి ప్రకటనలో పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు : శేరి సతీష్ రెడ్డి

### ప్రభుత్వ పథకాలను చూసి చేరిన వివిధ పార్టీల నాయకులు - జిల్లా అధ్యక్షులు, కూకట్‌పల్లి ఇన్చార్జి సారాధ్యంలో త్వరలో చేరికలు

**కూకట్‌పల్లి, ఆగస్టు 21 (నమస్తే ఉదయం):** కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి అన్నారు. బుధవారం కెపిహెచ్బి లోని ఆయన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో పాలన ప్రజాభిష్టం మేరకు కొనసాగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు కూకట్ పల్లి నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డితో చర్చలు జరిపారు.

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి మరింత మైలేజ్ వచ్చే క్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లో కలిపి సుమారు 1000 మంది యువత కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సంసిద్ధంగా ఉందని అన్నారు. శేరి సతీష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరే వారికి పార్టీ ప్రతిష్టకు కృషి చేస్తే భవిష్యత్తులో వారికి రాజకీయ అవకాశాలు వస్తాయని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ అభిమానులు కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు. ప్రజల ఆశీర్వాదంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలైనా కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించగలరని శేరి సతీష్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు క్రిస్టియన్ మైనార్టీ మేకల మైకల్, దేవ సహాయం రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ అరవింద్ రెడ్డి, లుంగీ రాజు, రాజు ముదిరాజ్, శేషగిరిరావు, కొమ్మ బాబు, సన్నీ, గణేష్, శివారెడ్డి,సంతోష్, సోను, తదితరులు పాల్గొన్నారు.



షేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక

# ప్రజాహితం కోసం నిరంతరం కృషి చేస్తా

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

### ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన శ్రీనగర్ కాలనీవాసులు

**మల్కాజిగిరి, ఆగస్టు 21(నమస్తే ఉదయం):** ప్రజాహితమే లక్ష్యంగా ముందుకు వెళుతూ సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తున్నామని మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలని వాసులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో కలిసి కాలుష్య సమస్యను పరిష్కరించిన సందర్భంగా కృతజ్ఞతలు చెప్పారు. గతంలో శ్రీనగర్ కాలనీలోని ఇండస్ట్రియల్ ఏరియాలోని సుప్రీం కెమికల్ కంపెనీలోని కెమికల్ వ్యర్థాలను శ్రీనగర్ కాలనీ డ్రైనేజీలో కలపడంతో తీవ్రమైన కాలుష్యంతో ప్రజలు ఆరోగ్యం పరమైన సమస్యలతో ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి డ్రైనేజీ వ్యవస్థను డైవర్షన్ చేయించడంతో సమస్య పరిష్కారమైంది. దీంతో కాలనీవాసులు ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మరో సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు, నిన్న అర్ధరాత్రి సమయంలో అదే సుప్రీం కెమికల్ కంపెనీలోని వ్యర్థాలను కాలని ఆవరణలో కాల్చి వేసిన కంపెనీ నిర్వాహకులు, విషయం తెలిసి కాలని వాసులు కాల్చివేతను అడ్డుకొని ఎమ్మెల్యే దృష్టికి ఈ విషయాన్ని తీసుకొచ్చారు, సంబధిత పొల్యూషన్ కంట్రోల్ అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే వెంటనే కంపెనీ మీద చర్యలు తీసుకొని, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండ చూడాలని ఆదేశించారు. ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డిని కలిసిన వారిలో కాలనీవాసులు ఇబ్రహీం,నయీం, మోయిన్ తదితరులు ఉన్నారు.



కాలుష్య సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన కాలనీవాసులు

# అంగన్వాడిల రిటైర్మెంట్ కొత్త జీవో విడుదల చేయాలి

**కొత్తకోట, ఆగస్టు 21 (నమస్తే ఉదయం):** రాష్ట్రంలో అంగన్వాడి టీచర్స్, హెల్పర్స్‌కు నష్టం కలిగించే జీవో నెంబర్ 10 ని రద్దు చేయాలని అంగన్వాడి టీచర్స్ హెల్పర్లకు రిటర్మెంట్ బెనిఫిట్ కొరకు కొత్త జీవో ను వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ ప్రభుత్వాన్ని కోరారు. అంగన్వాడి టీచర్లు బుధవారం కొత్తకోట తాసిల్దారు వెంకటేశ్వర్లకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడి సమస్యల పరిష్కారం కోసం 2024 ఏప్రిల్ నుండి జూలై వరకు సమ్మె చేశాం జులై 16న ఐసిడిఎస్ మంత్రి సీతక్క జులై 19న ఐసిడిఎస్ డైరెక్టర్ అంగన్వాడీలకు రెండు రోజుల్లో కొత్త జీవో ఇస్తామని ప్రకటించారు కానీ నెలరోజులు గడుస్తున్నా నేటికీ కొత్త జీవో ప్రభుత్వం జారీ చేయలేదుఅన్ని చెప్పారు. జులై 1 నుండి విధుల నుండి తొలగించబడి నా రిటైర్మెంట్ అయినా హెల్పర్లకు టీచర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వకపోవడంతో ఎలాంటి ఉపయోగం లేదని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట మీద నిలబడకపోవడం కొత్త జీవో ఆలస్యం కావడంతో అంగన్వాడి ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు. వెంటనే అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్ కొత్త జీవోను విడుదల చేయాలని అంగన్వాడీలను అందరిని పర్మనెంట్ చేయాలని ఆయన కోరారు. అంగన్వాడి కేంద్రాలకు బాత్రూం మంచినీటి సౌకర్యం కరెంటు కాంపౌండ్ వాల్స్ లేకపోవడంతో ఇబ్బందుల కు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు.ఆరోగ్య లక్ష్మి మెస్ ఛార్జీలు పెంచడం లేదని కనీస సౌకర్యాలైన అంగన్వాడి కేంద్రాలలో టేబుల్స్ కుర్చీలు బీరువాలు సరిపడా వంట పాత్రలు ఇవ్వట్లేదని ఆయన ఆరోపించారు. కూరగాయలు సోప్స్ చీపుర్లు బిందెలు బకెట్లు పంపిణీ చేయకపోవడం మరి దారుణమని ఆయన అన్నారు కోడిగుడ్లు ప్రభుత్వం సప్లై చేస్తుంది కానీ 50 గ్రాముల గుడ్డు అసలు సప్లై చేయడం లేదని అతి చిన్నవి ఫిట్ట గుడ్ల లాంటివి సప్లై చేస్తున్నారని ఆయన చెప్పారు ఐసిడిఎస్ తోపాటు బిఎల్ఓ డ్యూటీలు ప్రభుత్వం చెప్పే అనేక సర్వేలు చేస్తున్న అంగన్వాడి సమస్యలు పరిష్కారం చేయకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ దని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు వెంకటేశ్వరమ్మ, వనజ కుమారి, విజయలక్ష్మి, నిర్మల ,అలివేల,శోభ, పార్వతి, తస్లిం, శ్రీదేవి,అన్నపూర్ణ, కాళికా బాలేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న అంగన్వాడి టీచర్లు

## మహిళా డాక్టర్‌పై హత్యాచార ఘటన

# నిందితులను కఠినంగా శిక్షించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు21(నమస్తే ఉదయం):** కోల్‌కతా ఆర్జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ విద్యార్థిని అత్యాచారం, హత్యకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని మాజీ జెడ్పీచైర్ పర్సన్ సరిత, గద్వాల మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో కోల్‌కత మహిళా డాక్టర్ పై జరిగిన ఘటనకు నిరసనగా వైద్యులు, వైద్య సిబ్బంది చేపడుతున్న నిరసన కార్యక్రమానికి వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఆసుపత్రులలో వైద్య సిబ్బందికి, మహిళలకు భద్రత లేకపోవడం వ్యవస్థ వైఫల్యమేనని విమర్శించారు.

ఇలాంటి అమానవీయ ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, కేసు దర్యాప్తును వేగవంతం చేసి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రుల్లో డాక్టర్లకు తగినంత భద్రతా చర్యలను ఏర్పాటు చేయాలని కోరారు. పిజి మెడికల్ విద్యార్థినిపై క్రూరమైన ఘటనలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్లప్ప, పులిపాటి వెంకటేష్, నరహరి గౌడ్, డిటిడిసి నర్సింహులు, తుమ్మల నర్సింహులు, కొటేష్,అల్వాల రాజశేఖరరెడ్డి, భాస్కర్ యాదవ్,జనార్ధన్ రెడ్డి, శెట్టి ఆత్మకూరు లక్ష్మణ్,రంజిత్ కుమార్,మాజీ సింగిల్ విండో చైర్మన్ సీసల్ వెంకట్ రెడ్డి,గోపాల్ వర్మ,కేడిఆర్ మధు,కుర్వ శ్రీనివాసులు, ఆనంద్ గౌడ్,డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

## వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన యూజి కోర్సులలో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువు పెంపు

**రాజేంద్రనగర్, ఆగస్టు21(నమస్తే ఉదయం):** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, పీవీ నరసింహా రావు వెటర్నరీ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయాల్లో వివిధ యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు తేదీని ఈనెల 29 వరకు పొడిగించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు బై.పి.సి స్ట్రీమ్ కోర్సుల్లో దరఖాస్తు చేసుకునే తేదీని పెంచినట్లు జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్. పి. రఘురామిరెడ్డి తెలిపారు.

జూలై 12వ తేదీ నుంచి ఆగస్టు 17వ తేదీ వరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తొలి విడతలో దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రార్ సూచించారు. పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయ వెబ్సైట్ ఞఞఞ.జూర్ఠఖబ.వసబ.ఱఅను సందర్శించాలని సూచించారు.

## విద్యుత్ శాఖలో పదోన్నతుల సంబరాలు

### సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, సిఎండి ముషారఫ్‌లకు కృతజ్ఞతలు తెలిపిన ఉద్యోగులు

**మెహదీపట్నం, ఆగస్టు21(నమస్తే ఉదయం):** విద్యుత్ శాఖలో ప్రభుత్వం భారీ సంఖ్యలో పదోన్నతులు కల్పించిన సందర్భంగా అధి కారులు, సిబ్బంది సంబరాలు జరుపుకుంటున్నారు. బుధవారం మెహిదీపట్నం నానల్





విద్యుత్ శాఖలో పదోన్నతులు ఇచ్చిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎస్ ఏ ఓ వీరస్వామి, అధికారులు సిబ్బంది

నగర్ చౌరస్తాలో గల రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో పదోన్నతులు ఇచ్చిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, సిఎండి ముషారఫ్ ల చిత్రపటాలకు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధి,ఎస్ ఏ ఓ వీరస్వామి మాట్లాడుతూ... ప్రభుత్వం గతంలో ఎప్పుడు చేయని విధంగా విద్యుత్ శాఖలో పదోన్నతులు కల్పించి న్యాయం చేయటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యుత్ శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ నాగరాజ్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ అనిల్ రెడ్డి, మాణిక్ రావు, ఆర్టిజన్లు వేణు, శ్రీశైలం, రఘు, రవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

**రాజేంద్రనగర్, ఆగస్టు21(నమస్తే ఉదయం):** ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యల కారణంగా ఓ వ్యక్తి ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన అత్తాపూర్ రెడ్డి బస్తీలో మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అత్తాపూర్ రెడ్డి బస్తీలో నివాసం ఉండే ఒగ్గు వెంకటేష్ (46) స్థానిక పెట్రోల్ బంకులో పనిచేస్తాడు. 15 సంవత్సరాల కిందట భార్య మరణించింది. ఆయన తల్లి కుమారుడు కార్తీక్‌తో కలిసి నివాసం ఉంటున్నాడు. మానసిక ఇబ్బం దులతో గతంలో రెండుసార్లు ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. మంగళవారం రాత్రి ఇంట్లో ఒక్కడే ఉన్న సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. కేసును అత్తాపూర్ ఇన్స్పెక్టర్ వెంకటరామిరెడ్డి పర్యవేక్షణలో ఎస్సై శ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నారు.



ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని మృతి చెందిన ఒగ్గు వెంకటేష్

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తా

### శంషిగూడ ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బోర్‌ను ప్రారంభించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

**కూకట్‌పల్లి, ఆగస్టు 21 (నమస్తే ఉదయం):** శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో గల శంషిగుడా ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా ఏర్పాటుచేస్తున్న నీళ్ల బోర్ ను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బోర్ నిర్మాణం విజయవంతమై నీళ్లు రావాలని భగవంతుణ్ణి కోరుకునట్లు తెలిపారు. నీళ్లు పడితే స్కూల్ అవసరాలకు, పిల్లలకు నీటి కొరత ఉండదని అన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, హైస్కూల్ ప్రిన్సిపాల్ టి.నరసింహులు, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సుందరరావు, జి.నరసింహులు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



బోరు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

## బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న
# మారణకాండపై గద్వాలలో ఆందోళన

**గద్వాల జిల్లా ప్రతినిధి ,ఆగస్టు21 (నమస్తే ఉదయం):** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణకాండపై గద్వా లలో హిందువులు కదం తొక్కారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలుగా ఉన్న హిందువులపై దాడులు నిరసిస్తూ గద్వాల హిందు సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం గద్వాల పట్టణంలో బంద్ నిర్వ హించారు. పలు వ్యాపార దుకాణాలు, విద్యా సంస్థలు బంద్ చేయించారు. హిందు సంఘాలు, వివిధ సామాజిక సంఘాలు, రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు గద్వాల్ లోని సోమనాద్రి కోట నుంచి వైస్ ఆర్ చౌక్, కృష్ణవేణి చౌక్ మీదుగా పట్టణ పురవీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. వ్యాపారులు, వివిధ వర్గాల ప్రతినిధులు స్వచ్ఛందంగా బంద్ ర్యాలీలో పాల్గొన్నారు. కృష్ణవేణి చౌరస్తాలో మానవహారం నిర్మించి బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగు తున్న దాడులను ముక్తకంఠంతో ఖండించారు.




చేతుల్లో ప్లకార్డులు పట్టుకొని బంగ్లాదేశ్ ప్రభు త్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...

బంగ్లాదేశ్‌లో హిందువులనే లక్ష్యంగా ఎంచుకొని అక్కడ ఉన్న స్థానికులు దౌర్జన్యాలకు హత్యలకు, అత్యాచారాలకు పాల్పడ్డారని మండి పడ్డారు.

బంగ్లాదేశ్‌లో ఘోరమైన పరిస్థితులు నెలకొన్నాయని హిందువులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న మారణకాండను తక్షణం నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ముస్లిం దేశాలలో హిందువులను లేకుండా చేయాలని లక్ష్యంతో ఇలా చేస్తున్నారని పేర్కొ న్నారు. అవసరమైతే తాము కూడా పోరాటాలు చేసేందుకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హిందు సంఘాల ఐక్య వేదిక నాయకులు, భజరంగ్ దళ్ నాయకులు, హిందువులు పాల్గొన్నారు.

# సెలవులోకి వెళ్లిన గద్వాల్ సీఐ

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు21(నమస్తే ఉదయం):** వ్యక్తిగత పనులపై గద్వాల్ సీఐ భీంకుమార్ సెలవులోకి వెళ్లినట్లు సమాచారం. కాగ రాజకీయ ఒత్తిళ్లతోనే సీఐ సెలవుపై వెళ్లినట్లు గద్వాలలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 2024 పార్ల మెంట్ ఎన్నికల నేపథ్యంలో బదిలీలో భాగంగా గద్వాల సీఐగా భీంకుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల అనంతరం గద్వాల సీఐ గా భీంకుమార్ అలాగే కొనసాగారు. గెలిచిన అభ్యర్థి, ఓడిన అభ్యర్థి ఇద్దరు ఒకే పార్టీలో రెండు వర్గాలు ఉండడంతో అధికారులు గద్వాల నియోజకవర్గంలో పని వేయాలంటే కత్తి మీద సాములా మారింది.

అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలిచిన అనంతరం పోలీస్ డిపార్ట్మెంట్ శాఖలో అందరు మార్పులు చేర్పులయ్యాయి. ఎస్ఐ స్థాయి నుండి ఎస్పీ స్థాయి వరకు మార్పులు చేర్పులు అయ్యాయి. కాగ ప్రతి పక్ష బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పార్లమెంటు ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీచైర్ పర్సన్ సరిత మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనేలా వైరం తారస్థాయికి చేరింది. కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత గద్వాల ఎమ్మెల్యే బండ్ల, మాజీ జెడ్పీచైర్ పర్సన్ సరిత మధ్య అంతర్గత విబేధాలు తారస్థాయికి చేరుకున్నాయి. దీంతో ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో ఆధిపత్య పోరుతో అధికారులు గద్వాల లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు తలలు పట్టుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఎవరిని వెంట పెట్టుకోవాలో, పర్యటనకు వచ్చినప్పుడు ఎవరి ఇంటికి వెళ్లాలో తెలియక రాష్ట్ర స్థాయి ప్రజా ప్రతినిధులు సైతం గద్వాల పర్యటన కు వెళ్లాలో లేదో అయోమయ పరిస్థితి నెలకొంది. అధికారులు లోలోన సతమవతున్నట్లు తెలుస్తోంది. నడిగడ్డ అధికార పార్టీలో జరుగుతున్న రాజకీయ పరిణామాలకు అధిష్టానం చెక్ పెడుతుందో లేదో వేచి చూడాలి.

### కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు... పరస్పర కేసులు

అధికార కాంగ్రెస్ పార్టీలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీచైర్ పర్సన్ సరిత మధ్య ఆధిపత్య పోరు తారస్థాయికి చేరుకుంది.

బీఆర్ఎస్ పార్టీనుంచి గెలుపొందిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన చేరికను చివరి వరకు అడ్డుకోగా.. అధిష్టానం నచ్చజెప్పడంతో ఆమె వెనక్కి తగ్గారు. కాగ ఇటీవల రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి మంత్రి జూపల్లి కృష్ణారావు ర్యాలంపాడు, గట్టు ఎత్తిపోతల ప్రాజెక్టు సందర్శనలకు గద్వాలకు పర్యటించిన సమయంలో మంత్రి జూపల్లి కాన్వాయ్ ను మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత వర్గీయులు అడ్డుకోవడం తీవ్ర దుమారం లేపింది. అంతే కాకుండా గట్టు ఎత్తిపోతల పథకం పర్యటనలో భాగంగా గద్వాల ఎమ్మెల్యే బామర్ది మోహన్ రెడ్డి వాహనాన్ని సరిత వర్గీయులు ధ్వంసం చేశారంటూ సరిత వర్గీయులపై గట్టు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అదే




విధంగా సరిత వర్గీయులకు చెందిన వారి బంగారు ఆభరణాలు, కారు ధ్వంసం చేశారంటూ గద్వాల ఎమ్మెల్యే వర్గీయులపై కేసులు నమోదు చేశారు. గట్టు పోలీస్ స్టేషన్ లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల వర్గీయులు 9 మందిపై, సరిత వర్గీయులు 7మందిపై కేసులు నమోదయ్యాయి. అదే విధంగా గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్ లో సరిత వర్గీయులు ఇద్దరితోపాటు మరికొందరిపై కేసులు నమోదయ్యాయి.

గద్వాల పోలీస్ స్టేషన్ లో సరిత వర్గీయులపై సుమోటగా కేసు నమోదైనట్లు తెలుస్తోంది. గద్వాల ఎమ్మెల్యే బండ్ల, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత వర్గీయులపై పరస్పరం కేసులు నమోదు కావడం ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

దీనిపై గద్వాల డీఎస్పీ సత్యనారాయణ ను వివరణ కోరగా గద్వాల సీఐ భీంకుమార్ వ్యక్తిగత పనులపై సెలవుపై వెళ్లినట్లు తెలిపారు.

## చెరువులు కాలువలపై వెలుస్తున్న కట్టడాలపై హైడ్రా కమిషనర్
# రంగనాథ్‌కు ఫిర్యాదు చేసిన బిజెపి నాయకులు

### శంషాబాద్ కమిషనర్‌తో మాట్లాడిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

**శంషాబాద్, ఆగస్టు 21(నమస్తే ఉదయం):** శంషాబాద్ లోని పలు చెరువులో కాలువలపై. ప్రభుత్వ దేవాదాయ శాఖ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని శంషాబాద్ భారతీయ జనతా పార్టీ నాయకులు హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు ఫిర్యాదు చేశారు. దేవేందర్. కొండ పరమేష్ గౌడ్. రాజిరెడ్డి. సురేందర్. కొలను ప్రదీప్ రెడ్డి. కొలను జగ్జీవన్ రెడ్డి .మహిపాల్ రెడ్డి. విజయ భాస్కర్ రెడ్డి. సుదర్శన్ రెడ్డి. జనార్దన్ రెడ్డి తదితరులు బుధవారం హైడ్రా కమిషనర్ ను కలిసి ఫిర్యాదు చేశారు.

శంషాబాద్ పట్టణ నడిబొడ్డులోని రాల్లగూడ దోషికుంటలో చెరువును ఆక్రమించి ఏదేచ్ఛగా నిర్మాణాలు సాగుతున్నాయని. కాముని చెరువు సమీపంలో కాల్వపై పెద్ద ఎత్తున నిర్మాణాలు జరుగుతున్నాయని. శాతం రాయిలోని యదేచ్ఛగా నిర్మాణాలు సాగుతున్నాయని వారు ఫిర్యాదు చేశారు.

వీరి ఫిర్యాదు అందుకున్న రంగనాథ్ వెంటనే శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్ రావుకు ఫోన్ చేసి వివరాలు అడిగినట్లు బిజెపి నాయకులు తెలిపారు. వెంటనే కబ్జాలకు



చెరువులపై మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

సంబంధించిన పూర్తి వివరాలు తనకు అందజేయాలని ఆయన ఆదేశించినట్లు తెలిపారు.

అనంతరం మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు ను కలిసి బిజెపి నాయకులు వినతి పత్రం అందజేశారు.



మీరాలం చెరువు మ్యాప్‌ను పరిశీలిస్తున్న దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్న. చిత్రంలో ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్

## మీరాలం చెరువు చుట్టూ ఉన్న బస్తీలలోకి
# వరద నీరు రాకుండా చూడాలి

**రాజేంద్రనగర్, ఆగస్టు21 (నమస్తే ఉదయం):** వర్షాలు పడినప్పుడల్లా మీరాలం చెరువు పరివావాక ప్రాంతాలలో గల ఇండ్లలోకి వరద నీరు చేరుతుందని, వరద నీరు మీరాలం చెరువులోకి వెళ్లే విధంగా పనులు చేపట్టాలని శాసనమండలి సభ్యుడు మీర్జా రహ్మత్ బేగ్ కోరారు. బుధవారం దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్న తో కలిసి ఆయన మీరాలం చెరువు చుట్టూరా ఉన్న నెక్లెస్ రోడ్డు పరివాహక ప్రాంతాన్ని సందర్శిం చారు. వర్షం కారణంగా వచ్చే వరద మీరాలను చెరువులోకి వెళ్లేటట్లు చూడాలన్నారు. అందుకోసం ఔట్ లెట్ లను ఏర్పాటు చేయాలన్నారు. హసన్ నగర్, ఎన్టీఆర్ నగర్, మీరాలం నెక్లెస్ రోడ్, ఇందిరా నగర్, మహమూద్ నగర్, జబెల్ నూర్ తదితర బస్తీలలో పర్యటిం చారు. కార్యక్రమంలో మజ్లీస్ నాయకులు నవాజుద్దీన్, హబీబ్ జైన్ ఆరిఫ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



హసన్ నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్, గ్రేటర్ దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్న తదితరులు

**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733